సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 31 । జనవరి । 2024



ఘోర రోడ్డు ప్రమాదం

సాంకేతిక లోపంతో రోడ్డుపై ఆగిపోయిన లోడు లారీని అదే మార్గంలో వస్తున్న టిప్పర్ వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు.

8లో



డామిట్ కథ అడ్డం తిరిగింది

అప్పుల పాలైన ఓ ధాన్యం వ్యాపారి బీమా సొమ్ము కోసం తాను మృతి చెందినట్లు.. శవపేటికలో ఉన్న మృతదేహాన్ని తెచ్చి.. కాల్చి నమ్మించేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 10,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.60 అడుగులుగా నమోదైంది.

పేదల ఇళ్లల్లో.. విద్యుత్ వెలుగులు

- జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- నిర్మాణం పూర్తయిన వెంటనే కరెంటు సౌకర్యం
- వడివడిగా మంచి నీరు, డ్రైనేజీ సదుపాయాలు
- జిల్లాలో మొత్తం 437 లే అవుట్లు
- నిర్మించిన ఇళ్లు 23,497
- విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినవి 23,348



దొమ్మేరు జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సొంత ఇల్లు.. ఇది ప్రతి పేదవాడి కల. చాలీచాలని ఆదాయాలు.. నానాటికీ పెరుగుతున్న ఖర్చులతో సొంతింటి నిర్మాణం ఎప్పటికీ సాధ్యం కాదని సామాన్యులు భావిస్తారు. గత్యంతరం లేక అద్దె ఇళ్లల్లోనే జీవితాలు నెట్టుకొస్తారు. కానీ, వారి కలలను సాకారం చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నాడు విపక్ష నేతగా ప్రజా సంకల్ప యాత్ర చేసినప్పుడు సొంత గూడు లేక నిరుపేద, మధ్య తరగతి ప్రజలు పడుతున్న అవస్థలను ప్రత్యక్షంగా చూశారు. అధికారంలోకి రాగానే వారికి సొంతింటి భాగ్యం కల్పించాలని నిర్ణయించుకున్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకాన్ని గత ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చారు. అధికారం చేపట్టగానే పేదల ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. తొలుత వారి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు సేకరించారు. ఆర్థికంగా భారమైనప్పటికీ చాలా చోట్ల స్థలాలను కొనుగోలు చేశారు. అర్హులైన నిరుపేదలను ఎంపిక చేసి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఇంటి నిర్మాణ స్వేచ్ఛను వారికే ఇచ్చారు. ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చే ఏర్పాటు చేశారు. ఇంటి జాగా సమకూరడంతో లబ్ధిదారులైన పేద, మధ్యతరగతి ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

విమర్శలు తిప్పికొడుతూ..

పేదలకు మేలు జరగడాన్ని సహించలేని విపక్షాలు విమర్శలకు దిగాయి. ఇల్లు అలకగానే పండగ కాదు.. ఊరి చివరన ఉన్న స్థలాల్లో సదుపాయాలు కల్పించడం ఆషామాషీ కాదని తమ దుగ్ధను బయట పెట్టుకున్నాయి. ఇళ్ల నిర్మాణం సాధ్యం కాదని ప్రచారం చేశాయి. వాటన్నింటినీ ప్రభుత్వం తిప్పికొడుతూ ఒక్కో పనీ పూర్తి చేస్తూ వచ్చింది. చూస్తుండగానే జగనన్న కాలనీలు ఏర్పడ్డాయి. మరోవైపు సొంతంగా స్థలం ఉండి, ఇంటి నిర్మాణం చేపట్టలేని వారికి కూడా ప్రభుత్వం జగనన్న కాలనీల మాదిరిగానే సహకారం అందించింది. జిల్లావ్యాప్తంగా 95 శాతం పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయింది. జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. నీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర సదుపాయాలు వడివడిగా కల్పించింది. జిల్లాలో ఇప్పటి వరకూ 23,497 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. సొంత స్థలంలో నిర్మించుకున్న 13,629 ఇళ్లు, జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తయిన 9,719 ఇళ్లు కలిపి జిల్లా వ్యాప్తంగా మొత్తం 23,348 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీల ఇళ్లపై కలెక్టర్ కె.మాధవీలత ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి వారం వీటి పురోగతిని సమీక్షిస్తున్నారు.

శరవేగంగా మౌలిక సదుపాయాలు



జగనన్న కాలనీలో శరవేగంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రతి ఇంటికీ కరెంట్, వాటర్, డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటి వరకూ నిర్మాణం పూర్తయిన 95 శాతం పైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించాం.

– కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

నియోజకవర్గం	పూర్తయిన ఇళ్లు	సొంత స్థలంలో విద్యుత్ ఇచ్చినవి	లే అవుట్‌లో విద్యుత్ ఇచ్చినవి
అనపర్తి	3,389	1,991	1,391
రాజానగరం	3,842	2,866	936
రాజమహేంద్రవరం రూరల్	1,877	686	1,188
జగ్గంపేట	318	100	207
రాజమహేంద్రవరం అర్బన్	2,092	1,064	1,010
కొవ్వూరు	5,048	2,635	2,409
నిడదవోలు	3,616	3,986	2,319
గోపాలపురం	618	304	259

సొంతింటి కల నెరవేరింది



సొంతిల్లు నిర్మించుకుంటామని కలలో కూడా అనుకోలేదు. విద్యుత్ కనెక్షన్ కూడా వెంటనే ఏర్పాటు చేశారు. ఇంత వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడమే కాకుండా.. వాటిని పూర్తి చేసి, మౌలిక వసతులు ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– పర్వీన్ బేగం, వెలుగుబంద, ప్లాట్ నంబర్ 6919

ఇంటికి వెలుగు వచ్చింది



ఇంటి నిర్మాణం పూర్తయిన వెంటనే కరెంట్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. వెలుగుబంద జగనన్న కాలనీలో అన్ని ఇళ్లకూ కరెంట్ కనెక్షన్లు ఇచ్చారు.

– జన కృష్ణకుమారి, వెలుగుబంద, ప్లాట్ నంబర్ 438

జగనన్నకు కృతజ్ఞతలు



మాలాంటి పేదలకు ఇంటి నిర్మాణం చేపట్టడమే కాకుండా అన్ని వసతులూ కల్పించిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. వెలుగుబందలో ఇంటి స్థలం తీసుకోవద్దని చాలా మంది వెనక్కి లాగారు. అక్కడ ఇల్లు పూర్తవ్వాలంటే పది సంవత్సరాలు పడుతుందని, ఇంక కరెంట్ వంటివి రావడానికి మరో ఐదేళ్లు పడుతుందని అడ్డం పడ్డారు. కానీ మాకు జగనన్న మీద పూర్తి నమ్మకం ఉంది. ఇంత తొందరగా ఇల్లు నిర్మించడమే కాకుండా అన్ని వసతులూ కల్పించారు.

– కప్పుల నాగమణి, వెలుగబంద, ప్లాట్ నంబర్ 8937

పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు



లాలాచెరువు పాఠశాలను సందర్శించిన ప్రత్యేక బృందం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని అన్ని పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు మూడు రోజుల పాటు పర్యవేక్షిస్తున్నాయి. ఈ బృందాలు మంగళవారం జిల్లాలో పర్యటించాయి. పాఠశాల సౌకర్యాలు, ఉపాధ్యాయుల పనితీరు, సిలబస్ పూర్తి, నోట్ బుక్స్ కరెక్షన్, ఐఎఫ్‌పీల నిర్వహణ, పనితీరు వంటి అంశాలను ఈ బృందాలు పరిశీలిస్తాయి. అనంతరం జిల్లా విద్యా శాఖాధికారికి సమగ్ర నివేదిక సమర్పిస్తాయి. ఈ బృందానికి ఎంఈఓ-1, 2లు సారథ్యం వహిస్తున్నారు. దీనిలో భాగంగా లాలాచెరువులోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను సీతానగరం ఎంఈఓ-1 స్వామినాయక్ సందర్శించారు. విద్యార్థుల నోట్ బుక్స్ క్షుణ్ణంగా పరిశీలించారు. వారితో కొన్ని పాఠ్యాంశాలు చదివించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో బుధవారం నుంచి ఫిబ్రవరి మూడు వరకూ ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లూ చేసినట్టు మంగళవారం రాత్రి ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో పోటీలు విజయవంతంగా ముగిశాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకూ పోటీలు నిర్వహించామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థి, ఉపాధ్యాయులు

బిక్కవోలు: తమ విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైందని పందలపాక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చీర్ల శ్రీనివాసరెడ్డి మంగళవారం విలేకర్లకు తెలిపారు. విజయవాడలో దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి కేఎల్ఎస్ చైతన్య 'లైఫ్ సేవింగ్ లో కాస్ట్ వెంటిలేటర్' ప్రాజెక్టు ప్రదర్శించాడన్నారు. కరోనా సమయంలో అవసరమైనన్ని వెంటిలేటర్లు లేకపోవడంతో చాలా మంది రోగులు ప్రాణాలు వదిలారని, ఈ సమస్యను అధిగమించే ఆలోచనతో చైతన్య ఈ 'లో కాస్ట్ వెంటిలేటర్' పరికరం తయారు చేశాడని, ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. విజయవాడలో జరిగిన దక్షిణ భారత స్థాయిలో ప్రదర్శనలో హెచ్ఎం శ్రీనివాసరెడ్డితో పాటు సైన్స్ టీచర్లు జయకృష్ణరెడ్డి, శాంసన్, వీరెడ్డి పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాం ప్రారంభం



సీఆర్‌పీఎఫ్ సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో పాల్గొన్న అధికారులు, గిరిజన యువకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ ధర్మప్రకాశ్ ఆధ్వర్యాన సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా స్కిల్ డెవలప్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. గిరిజన యువకులకు ఉచిత డ్రైవింగ్ కోర్సు అందిస్తున్నామని ధర్మప్రకాశ్ తెలిపారు. ఎస్‌బీ మోటార్స్ జనరల్ మేనేజర్ ఎంవీవీఎస్ఆర్ గుప్తా దీనిని ప్రారంభించారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి, మోతుగూడెం గిరిజన ప్రాంతాలకు చెందిన యువకులకు వచ్చే నెల 18వ తేదీ వరకూ ఉచిత శిక్షణ, భోజన, వసతి సదుపాయాలు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో సెకండెంట్ ఇన్ కమాండెంట్ సురేష్‌బాబు, డిప్యూటీ కమాండెంట్ బి.రత్నమ్మ, డాక్టర్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పూర్వపు జిల్లా ఏపీ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ఆడియోమెట్రీషియన్ పోస్టును కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ ఎం.సనత్‌కుమారి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. దరఖాస్తులను ఈస్ట్‌గోదావరి.నిక్.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీలోగా కొవ్వూరులోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

బోర్డర్ చెక్ పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు



తూర్పుగానుగూడెం చెక్ పోస్టు వద్ద తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

రాజానగరం: జిల్లాలోని బోర్డర్ చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు నిరంతరం జరుగుతూనే ఉండాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. తూర్పుగానుగూడెం వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న బోర్డర్ చెక్ పోస్టును మంగళవారం ఆయన సందర్శించారు. వాహన తనిఖీలను పరిశీలించారు. గంజాయి, సారా, మద్యం, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఈ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని తూర్పు గానుగూడెం, రంగంపేట పరిధిలో రామేశంపేట, కడియం పరిధిలో పొట్టిలంక, గోపాలపురం స్టేషన్ పరిధిలో ఆ గ్రామ శివారు నుంచి ఖమ్మం వెళ్లే మార్గంలో, ఉండ్రాజవరం పరిధిలో పాలంగి, నల్లజర్ల పరిధిలో వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద బోర్డర్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని వివరించారు. వాహనచోదకులతో మర్యాదగా వ్యవహరించాలని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు.

రాష్ట్ర ద్రోహి చంద్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన ద్రోహి చంద్రబాబు నాయుడు అని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పరమహంస యోగానంద మార్గ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా రాకుండా చేసింది, పోలవరం ప్రాజెక్టును సర్వ నాశనం చేసింది చంద్రబాబేనని అన్నారు. 14 ఏళ్లు సీఎంగా చేశానని గొప్పలు చెప్పుకోవడం తప్పితే, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తాను ఎంపీగా ఈ నాలుగున్నరేళ్లలో కేవలం రూ.400 కోట్లతో రాజమహేంద్రవరం రూపురేఖలు మార్చానని చెప్పారు. పార్లమెంటులో తాను మాట్లాడినట్టు గత పదేళ్లలో టీడీపీ ఎంపీలు ఎవ్వరూ మాట్లాడలేదన్నారు. ఆవ భూముల్లో రూ.150 కోట్లు కొట్టేశానని, వర్కులో 15 శాతం తీసుకుంటానని ఆరోపించిన చంద్రబాబు.. వాటిని నిరూపించాలని సవాల్ విసరారు. జేఎన్ రోడ్డులోని పార్కుకు మహా నాయకుడు ఏకేసీ పేరు పెడితే దానిని ఎన్టీఆర్ పార్కుగా 2015లో తీర్మానం చేసేసి ఎలా మారుస్తారన్నారు. ఆర్ట్స్ కళాశాలలో అథ్లెటిక్ ట్రాక్‌ను సుమారు రూ.30 లక్షలతో కామాక్షి ఇండస్ట్రీస్ మురళి, ఆర్ఎంసీ నిర్మిస్తే అక్కడ టీడీపీ వాళ్లు సిగ్గు లేకుండా ఫ్లెక్సీలు పెట్టుకున్నారన్నారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని వడ్డీలు, చీటీల వ్యాపారాలతో బెదిరించే వారికి ప్రజలు ఓట్లు వేయరని ఎంపీ భరత్‌రామ్ అన్నారు.

అన్నవరానికి 'ప్రసాద్' సిద్ధం?

- 'సాక్షి' కథనంపై స్పందించిన ప్రజాప్రతినిధులు
- కేంద్రం తీరుపై అసంతృప్తి
- త్వరలో విడుదల చేస్తామన్న కేంద్ర అధికారులు

అన్నవరం: కేంద్ర ప్రభుత్వ పిలిగ్రిమేజ్ రిజువినేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మంటేషన్ (ప్రసాద్) పథకం కింద అన్నవరం దేవస్థానానికి రూ.10 కోట్లు మంజూరు చేయడానికి రంగం సిద్ధమైనట్లు సమాచారం. 'సత్యదేవునికి కేంద్ర ప్రసాదం లేనట్టేనా?' శీర్షికన ఈ నెల 27న 'సాక్షి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. కొద్ది రోజుల్లో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ఈ నెలలోనే ప్రసాద్ నిధులు విడుదల వ్వాలని, లేకుంటే ఇక సాధ్యం కాదని ఆ కథనంలో 'సాక్షి' వివరించింది. దీంతో ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ప్రసాద్ నిధులిస్తామంటూ ఎనిమిదేళ్లుగా ఊరించి.. రూ.54 కోట్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి.. చివరకు రూ.10 కోట్లు మాత్రమే ఇస్తామని చెప్పి.. ఆ మొత్తం కూడా ఇంతవరకూ విడుదల చేయకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో కేంద్ర టూరిజం శాఖ అధికారులు ప్రసాద్ స్కీము కింద వెంటనే రూ.10 కోట్లు విడుదల చేస్తామని చెప్పినట్లు సమాచారం.

అన్నదాన భవనానికి స్థల పరిశీలన

కాగా, ప్రసాద్ స్కీము నిధులు రూ.10 కోట్లు విడుదలైతే ఆ మొత్తంతో అన్నదాన భవనం నిర్మించేందుకు దేవస్థానం అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు ఎండోమెంట్స్ డిప్యూటీ స్తపతి శ్రీనివాసాచారి, దేవస్థానం డీఈ ఉదయ్ అన్నదాన భవనం నిర్మాణానికి పాత టీటీడీ భవనం స్థలాన్ని



పరిశీలించారు. సుమారు అరెకరం విస్తీర్ణం కలిగిన ఈ స్థలంలో మూడంతస్తులతో అన్నదాన భవనం నిర్మించాలని ప్రతిపాదించారు. ప్రసాద్ స్కీము నిధులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ప్రస్తుతం ఉన్న అన్నదాన భవనంలో ఒకేసారి 500 మంది భక్తులకు మించి భోజనం పెట్టేందుకు అవకాశం లేదు. కొత్త భవనంలో ఏక కాలంలో వెయ్యి మందికి భోజనం పెట్టేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఒకవేళ ప్రసాద్ స్కీము నిధులు విడుదల కాకపోతే దేవస్థానం నిధులతో అన్నదాన భవనం నిర్మించాలని కూడా అధికారులు యోచిస్తున్నారు.

రాజప్పకు సెగ



- సిట్టింగ్‌కే సీటన్న చంద్రబాబు
- ససేమిరా అంటున్న 'గుణ్ణం' వర్గం
- సంప్రదాయంగా ఈసారి తమ సామాజికవర్గానికే ఇవ్వాలని పట్టు
- అనారోగ్యం మిషతో రాజప్పను తప్పించేందుకు వ్యూహం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: టీడీపీలో సిట్టింగ్‌లకే సీట్లు అని చంద్రబాబు ఏ ముహూర్తాన ప్రకటించారో కానీ.. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఆయన చుక్కలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జనసేనతో పొత్తు టీడీపీలో మరింత అగ్గి రాజేస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీలోని చంద్రబాబు సొంత సామాజికవర్గ నేతలు తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాటి ప్రకటనలతో సంబంధం లేకుండా ఆరు నూరైనా సరే ఉమ్మడి జిల్లాలో మూడు సీట్లు ఇచ్చి తీరాల్సిందేనని ఆయన సొంత సామాజికవర్గం తిరుగుబాటు స్వరం వినిపిస్తోంది. ఇది చంద్రబాబుకు తలనొప్పిగా మారింది.

మూడు సీట్ల ఆనవాయితీపై సిగపట్లు

ఉమ్మడి జిల్లాలో 21 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. మొదటి నుంచి పెద్దాపురం, మండపేట, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్‌లో టీడీపీ తమకే ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు సామాజికవర్గ నేతలు గుర్తు చేస్తున్నారు. ఈసారి పొత్తులో రాజానగరాన్ని జనసేనకు వదిలేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మిగిలిన మూడింటికి సంబంధించి మండపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మరోసారి గెలిపించాలని 'రా.. కదలి రా' సభలో చంద్రబాబు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. రాజమహేంద్రవరం రూరల్‌పై ఇరు పార్టీల మధ్య ఇంకా స్పష్టత రాలేదు. ఇక మిగిలిన పెద్దాపురం సీటు టీడీపీ ఆవిర్భావం నుంచీ చంద్రబాబు సామాజికవర్గానికే దక్కుతోంది. దివంగత మాజీ ఎమ్మెల్యే బొడ్డు భాస్కర రామారావు చివరి రోజుల్లో ఆ స్థానం కోసం విఫల యత్నం చేశారు కూడా. అయితే, గడచిన రెండు సార్వత్రిక ఎన్నికల నుంచి ఈ సీటును కోనసీమ నుంచి తీసుకువచ్చిన కాపు సామాజికవర్గానికి చెందిన నిమ్మకాయల చినరాజప్పకు ఇస్తూ వస్తున్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సైతం ఈ సీటు చినరాజప్పకేనని చంద్రబాబు ఇదివరకే ప్రకటించారు. అప్పటి నుంచీ పెద్దాపురం టీడీపీలో రెండు సామాజికవర్గాలూ ఈ సీటు కోసం నువ్వా, నేనా అనే స్థాయిలో పోటీ పడుతున్నాయి. దీని ప్రభావం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాలపై పడుతోంది.

పెద్దాపురంపై గుణ్ణం కన్ను

మొదటి నుంచీ ఆనవాయితీగా ఇస్తున్న పెద్దాపురం సీటు కోసం చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన గుణ్ణం చంద్రమౌళి పావులు కదుపుతున్నారు. రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించిన తరువాత మౌళి పెద్దాపురంపై గట్టి పట్టే పడుతున్నారు. ఆర్థికంగా స్థితిమంతుడైన ఆయనకు లోకేష్‌తో మంచి సాన్నిహిత్యం ఉంది. కొంత కాలం నుంచి ఉమ్మడి జిల్లాలో చంద్రబాబు జరిపిన పర్యటనలకు మౌళి ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉంటున్నారని ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఈ క్రమంలో తమకు పార్టీ సీనియర్ నాయకులు యనమల రామకృష్ణుడు, జ్యోతుల నెహ్రూ వంటి వారి ఆశీస్సులున్నాయని మౌళి వర్గం ప్రచారం చేసుకుంటోంది.

రాజప్పకు వ్యతిరేకంగా.. ఇద్దరూ ఒక్కటై..

చినరాజప్పకు ఆరోగ్యం అంతగా సహకరించడం లేదని వైరి వర్గం చెబుతోంది. ఈ విషయాన్ని రా.. కదలి రా కార్యక్రమానికి రాజమహేంద్రవరం రూరల్ కాతేరు వచ్చిన చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. రాజప్పకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న చంద్రమౌళికి దివంగత బొడ్డు భాస్కర రామారావు తనయుడు, టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట రమణ చౌదరి వర్గం పరోక్షంగా మద్దతు ఇస్తోంది. అయితే, ఆవిర్భావం నుంచీ క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఉమ్మడి జిల్లాలో పార్టీకి సుదీర్ఘ కాలం సారథ్యం వహించిన రాజప్ప సీటుకు ఢోకా లేదని ఆయన వర్గీయులు చెబుతున్నారు. మౌళి వర్గాన్ని దీటుగా ఎదుర్కొనే సత్తా తమకు లేకపోలేదని అంటున్నారు. రాజానగరం సీటుపై వెంకట రమణ చౌదరి పెట్టుకున్న ఆశలపై జనసేన నీళ్లు చల్లడంతో.. ఆయన, మౌళి కలసి ఉమ్మడి కార్యాచరణతో చినరాజప్పకు పొగ పెడుతున్నారనే చర్చ టీడీపీ వర్గాల్లో విస్తృతంగా జరుగుతోంది. దీనికి అడ్డుకట్ట వేయడానికా అన్నట్టు వెంకట రమణ చౌదరికి రాజమహేంద్రవరం ఎంపీ స్థానాన్ని చూపించి బుజ్జగించేందుకు చంద్రబాబు అండ్ కో ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ టీడీపీలో వర్గ విభేదాలు మరింత ముదురు పాకాన పడేలా కనిపిస్తున్నాయి.

ఖర్చు మాది.. సీటు ఆయనదా!

పెద్దాపురం వరుసగా రెండుసార్లు రాజప్పకు కట్టబెట్టారని, ఇప్పుడు మూడోసారి కూడా ఆయనకే ఇస్తామంటే సహించేది లేదంటూ చంద్రబాబుపై ఆయన సామాజికవర్గ నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. చినరాజప్పకు వ్యతిరేకంగా మౌళి పలు వర్గాలను ఏకం చేసే పనిలో ఉండటంతో పెద్దాపురంలో పార్టీ రెండు వర్గాలుగా విడిచిపోయింది. ఈ సీటుపై ఆశతో ఏడాది కాలం నుంచి పార్టీ కోసం లక్షల రూపాయలు తగలేసుకుంటుంటే.. ఇప్పుడు సిట్టింగ్‌కే ఇస్తామంటే ఎలా సహకరిస్తామంటూ.. పెద్దాపురం నియోజకవర్గంలోని చంద్రబాబు సామాజికవర్గ నేతలు చినరాజప్పను బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో అప్పటి పరిస్థితులకు అనుగుణంగా చినరాజప్పకు అనివార్యంగా మద్దతు ఇవ్వాల్సి వచ్చిందని, ఈసారి తమ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వకుంటే తాడోపేడో తేలుస్తామని స్పష్టం చేస్తున్నారు. 2014లో స్థానికేతరుడైన చినరాజప్పకు సీటు ప్రకటించినప్పుడు ఆయన వాహనాలను ధ్వంసం చేసి నామినేషన్ వేయకుండా అడ్డుకున్న నాటి పరిస్థితులను వారు గుర్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: ప్రజలలో పఠనాశక్తిని పెంచేలా జిల్లాలోని గ్రంథాలయాలలో సదుపాయాలను ఆధునీకరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను కోరారు. మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్, సర్వసభ్య సమావేశం సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధ్యక్షతన ఆమె చాంబర్‌లో నిర్వహించారు. సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ 2023–24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2024–25 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదించారు. వివిధ ప్రభుత్వ గ్రాంటులు, గ్రంథాలయ సెస్ నిధులతో పుస్తకాలు, పత్రికల కొనుగోళ్లు, శాఖా గ్రంథాలయాల భవనాలకు మరమ్మతులు, అద్దెల చెల్లింపు, సిబ్బంది జీతభత్యాలు తదితర పద్దుల కింద అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లాలో శాఖా గ్రంథాలయాలు, గ్రామీణ గ్రంథాలయాలు లేనిచోట్ల పుస్తక పంపిణీ కేంద్రాల ఏర్పాటు, కేర్ టేకర్ల నియామకానికి ఆమోదం తెలిపారు. పాఠకులకు, విద్యార్థుల అవసరాలు, అభిరుచులకు అనుగుణమైన పుస్తకాలను అందుబాటులో ఉంచి, మెరుగైన వసతులతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించి అందుకు అవసరమైన నిధులు బడ్జెట్‌లో ప్రతిపాదించాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వరప్రసాద్‌ని ఆదేశించారు. విద్య, పంచాయతీ, వయోజన విద్య, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్



మాది తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం జగన్నాథపురం గ్రామం. అంబేడ్కర్ స్వయం సహాయక సంఘం టెంట్ హౌస్ నిర్వహిస్తూ జీవిస్తున్నాం. మా సంఘానికి ఈ దఫాతో కలిపి రూ.9 లక్షలు ఆసరాగా వచ్చాయి. ఒక్కో సభ్యురాలికి రూ.90 వేలు తీసుకున్నాం.గత టీడీపీ ప్రభుత్వం రుణ మాఫీ చేస్తానని మోసం చేసింది. అంతటితో ఆగకుండా ఎన్నికలకు ముందు పసుపు, కుంకుమ పేరుతో మళ్లీ మోసం చేయాలని చూసింది. కానీ డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందే జగన్ చెప్పారు. సీఎం అయ్యాక చెప్పిన మాట ప్రకారం సంపూర్ణంగా అమలు చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. గ్రూపు సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేసిన సాయం ఎంతో గొప్పది. మహిళల జీవితాలలో వెలుగులు నింపుతున్నారు. ఆయనకు మహిళలపై ఎంతప్రేమ ఉందో అర్థం అవుతుంది. జగన్ మహిళా పక్షపాతి. సీఎంకు కృతజ్ఞతలు.



కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్నా



నేను శ్రీదుర్గా మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. మా సంఘానికి రూ. 5లక్షల రుణం ఉంది. ఇప్పటికే రెండు విడతల్లో నాకు రూ.4,200 చొప్పున ఆసరా పథకంలో నా ఖాతాలోకి జగనన్న ప్రభుత్వం జమ చేసింది. మూడో విడత మొత్తాన్ని జమ చేసేందుకు అధికారులు వేలి ముద్రలు తీసుకున్నారు. జగనన్న తీసుకున్న ఈ నిర్ణయంతో కొబ్బరి కాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్నాను.

– రెడ్డి భాగ్యలక్ష్మి, లబ్ధిదారు, గాడిలంక, ముమ్మిడివరం

విద్యతోపాటు ఇతర అంశాలను అవగతం చేసుకోవాలి

ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రారెడ్డి



విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఏపీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రారెడ్డి

గండేపల్లి: మన చుట్టుపక్కల జరుగుతున్న అంశాలతోపాటు రాష్ట్రం, దేశాలలో మారుతున్న పరిస్థితులను అవగతం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) చైర్మన్ డాక్టర్ కె.హేమ చంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ విద్యాసంస్థలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ కేవలం సిలబస్ పరిధిలో అంశాలను పరిగణలోకి తీసుకుంటే సరిపోదని, మన ఆలోచనలు వినూత్నంగా, విలక్షణంగా ఉండాలని, ప్రపంచంలో జరుగుతున్న విజ్ఞాన అభివృద్ధి గురించి తెలుసుకుంటూ నూతన దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి వారితో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్, బాబ్జీ నీలం, పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- రావులపాలెం వద్ద హైవేపై సోమవారం అర్ధరాత్రి దుర్ఘటన
- సాంకేతిక లోపంతో ఆగిన లారీని ఢీ కొట్టిన టిప్పర్
- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు



టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ జుత్తుగ రవి, క్లీనర్ మణికుమార్



లోడు లారీ కింద డ్రైవర్, శ్రీనివాసరావు, క్లీనర్ నాగసత్యసాయి మృతదేహాలు



బలంగా ఢీ కొనడంతో అతుక్కుపోయిన టిప్పర్, లారీ

రావులపాలెం: సాంకేతిక లోపంతో రోడ్డుపై ఆగిపోయిన లోడు లారీని అదే మార్గంలో వస్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. సోమవారం అర్ధరాత్రి రావులపాలెం జాతీయ రహదారిపై గౌతమి కొత్త బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు సమీపంలో ఈ ఘోర ప్రమాదం సంభవించింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం మందపాడుకు చెందిన పేపేటి వెంకట శ్రీనివాసరావు (48), అతని కొడుకు నాగ సత్య సాయి (26) ఇద్దరు సొంత లారీని తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దీనిలో భాగంగా వారం క్రితం భీమవరం నుంచి చాపల్లోడుతో కోల్‌కతాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వైజాగ్‌లో తౌడు లోడ్ చేసుకుని మందపాడుకు పయనమయ్యారు. రావులపాలెం గౌతమి కొత్త బ్రిడ్జి దాటేసరికి వారి లారీ బ్రేక్ డౌన్ కావడంతో మరమ్మతు చేసుకునేందుకు డ్రైవర్, క్లీనర్ అయిన తండ్రి కొడుకులు ఇద్దరూ కిందకి దిగి లారీ వెనక టైర్ల వద్ద మరమ్మతులు చేస్తున్నారు. అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ వీరి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఇదిలా ఉండగా టిప్పర్ లారీలో డ్రైవర్, క్లీనర్లుగా ఉన్న జుత్తుగ రవి, ఎల్లె మణికుమార్ బావ, బావమరుదులు. వీరిది ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక. వీరు రావులపాలెంకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి గ్రావెల్ వేసుకుని వస్తుండగా బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న లారీని గుర్తించకపోవడంతో బలంగా ఢీ కొట్టారు. దీంతో రెండు లారీల మధ్య ఇరుక్కుపోయారు. తీవ్ర గాయాలతో రెండు లారీల మధ్య వారు నరక యాతన అనుభవించారు. అయితే సమాచారం తెలుసుకున్న పోలీస్, హైవే సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని రెండు భారీ క్రేన్ల సాయంతో సుమారు రెండు గంటల పాటు తీవ్రంగా శ్రమించి క్షతగాత్రులను బయటకు తీసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో క్షతగాత్రులను బయటకు తీసేందుకు డ్రైవర్ రవి తండ్రి శ్రీను చేసిన ప్రయత్నం స్థానికులను కలచివేసింది. ఒకే ప్రమాదంలో ఒక కుటుంబంలోని తండ్రి కొడుకులు మృత్యువాత పడగా, మరో కుటుంబంలోని బావ, బావమరుదులు తీవ్ర గాయాలు పాలవడం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు.

ప్రమాదానికి కారణం చీకటి, అతి వేగమేనా?

ఇంతి ఘోర ప్రమాదానికి కారణంగా అర్ధరాత్రి జాతీయ రహదారిపై లారీ ఆగిన ప్రాంతం చీకటిగా ఉండటంతోపాటు వెనుక వచ్చిన టిప్పర్ లారీ అతి వేగంగా రావడం కూడా అని భావిస్తున్నారు. వాతావరణం కూడా మంచుతో ఉండటంతో పాటు బ్రిడ్జి అప్రోచ్ వాలుగా ఉండటంతో వేగం నియంత్రణ కాకపోవడం, అక్కడ హైవే పై విద్యుత్ దీపాలు లేకపోవడం కారణాలుగా ఇతర వాహనదారులు అంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ శకటానికి తృతీయ స్థానం

ముక్కామల విద్యార్థులకు బహుమతులు



ఢిల్లీ రిపబ్లిక్ పరేడ్‌లో తృతీయ స్థానం కైవసం చేసుకున్న ఆంధ్రప్రదేశ్ శకటం

అంబాజీపేట: ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ కర్తవ్య పథ్‌లో నిర్వహించిన రిపబ్లిక్ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రదర్శించిన శకటానికి తృతీయ స్థానం లభించింది. శకట ప్రదర్శనలో పాల్గొన్న అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన కూచిపూడి విద్యార్థినులకు బహుమతులు లభించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ నేతృత్వంలో ఆర్టిస్ట్ గంటా మధు పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ శకటంగా 'ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యలో అధునాతన పద్ధతులు, అందుకు అనుగుణంగా విద్యార్థులను ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా చేయడం' అనే ఇతివృత్తంతో డిజిటల్ విద్యా బోధన, నాడు నేడు, పథకంలో పాఠశాలల ఆధునీకరణ, మౌలిక వసతుల కల్పన, ఆంగ్ల మాధ్యమంలో బోధన, తదితర నేపథ్యాలతో ఆంధ్రప్రదేశ్ శకటాన్ని రూపకల్పన చేసి ప్రదర్శించారు. శకటంతోపాటు 55 సెకండ్ల నిడివిగల 'థీమ్ సాంగ్' పాటను రూపొందించి, దానికి తగినట్టుగా శకటానికి ఇరువైపులా నృత్య ప్రదర్శన కోసం కూచిపూడి విద్యార్థినులను డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అంబాజీపేట మండలం, ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో సాయి శివనృత్య పాఠశాలకు చెందిన కూచిపూడి కళాకారులు (బాలికలు) స్కూల్ విద్యార్థులను ఎంపిక చేశారు. వీరు ఆంధ్రప్రదేశ్ స్కూల్ యూనిఫామ్‌లతో శకటానికి ఇరువైపులా నృత్యం చేస్తూ విశేషంగా ఆకట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ప్రదర్శించిన శకటంపై, రక్షణ శాఖ దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో 'వికసిత భారత్'లో భాగంగా శకటానికి మూడో స్థానం లభించింది. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రీయ రంగ శాల మంచ్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ చేతుల మీదుగా తృతీయ అవార్డును ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సమాచార శాఖ జేడీ పి. కిరణ్ కుమార్ అందుకున్నారు.

యానాంలో తీవ్ర విషాదం

స్విమ్మింగ్ పూల్‌లో పడి విద్యార్థి మృతి



మృతిచెందిన బాలుడు సాయిరోహిత్(7)

యానాం: స్విమ్మింగ్‌పూల్‌లో పడి విద్యార్థి మృతి చెందడంతో యానాంలో విషాదం అలుముకుంది. మంగళవారం స్థానిక అగ్రహారంలో శ్రీకృష్ణదేవరాయ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న సూరిమిల్లి సాయిరోహిత్(7) బాలయోగి స్టేడియం పరిధిలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో పడటంతో మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మార్చురీకి తరలించారు. సిబ్బంది నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమన్న ఆరోపణల నేపథ్యంలో ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు అధికసంఖ్యలో యానాం జీజీహెచ్‌కు తరలిరావడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అనంతరం అక్కడ నుంచి ఆర్ఏఓ ఆఫీసుకు తరలివచ్చి అక్కడ ఆందోళన ప్రారంభించారు. సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించాలని కోరారు.

సరైన సెక్యూరిటీ ఏర్పాట్లు లేకపోవడం వల్ల, స్టేడియం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని ఆరోపించారు. తక్షణం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని వారు నినాదాలు చేసి ధర్నా నిర్వహించారు. ఆర్ఏఓ మునిస్వామి పుదుచ్చేరి సీఎంఓకు పరిస్థితిని వివరించారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాలుడికి తల్లి,తండ్రి, సోదరుడు ఉన్నారు.



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

కుటుంబ సభ్యులకు ఓదార్పు : ఆర్ఏఓ మునిస్వామి ఆందోళన కారులతో మాట్లాడారు. అనంతరం స్విమ్మింగ్‌పూల్ వద్దకు వచ్చి పరిశీలించారు. జీజీహెచ్‌లో బాలుడి మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అగ్రహారానికి చెందిన రోహిత్ ఉదయం పాఠశాలకు వెళ్లాడు. భోజన విరామ సమయంలో మిత్రులతో కలిసి స్కూల్‌కు సమీపంలోని స్విమ్మింగ్‌పూల్ వద్దకు ఆడుకోవడానికి వెళ్లినట్లు భావిస్తున్నారు. ఘటనపై సీఐ షణ్ముగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి బ్యారేజీపై రాకపోకలు బంద్



కాటన్ బ్యారేజీ రోడ్డు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ మరమ్మతుల కారణంగా గురువారం నుంచి ఫిబ్రవరి పదో తేదీ వరకూ వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఇప్పటికే బ్యారేజీ రోడ్డు పైపొరను తొలగించారు. రోడ్డు నిర్మాణ సమయంలో ఆటంకాలు కలుగకుండా రాకపోకలను నిలిపివేస్తున్నారు. పది రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేసి వాహనాలను అనుమతిస్తారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



వీర ప్రభాకరరావు (పాత చిత్రం)

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో గాంధీనగర్‌కు చెందిన మామిడాల వీరప్రభాకరరావు (26) సోమవారం అర్ధరాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కథనం ప్రకారం విశాఖపట్నం నుంచి చెన్నై వెళుతున్న రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు డ్రైవరు ఈ రవికుమార్ నుంచి వచ్చిన సమాచారం మేరకు స్టేషన్ సూపరింటెండెంట్ పి.అనంతలక్ష్మి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుతో రైల్వే పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. మృతదేహం వద్ద లభించిన ఆధారాలతో మృతుని వివరాలను గుర్తించి రైల్వే ఎస్సై బి.లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు రెండు జిల్లాల్లో పట్టభద్రుల పండగ



స్నాతకోత్సవం జరిగే ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌ని నన్నయ వర్సిటీ వీసీతో కలిసి పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్



స్నాతకోత్సవ వివరాలు వెల్లడిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు

హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

రాజానగరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని జేఎన్టీయూ, ఆదికవి నన్నయ యూనివర్సిటీలలో బుధవారం స్నాతకోత్సవాలు జరుగనున్నాయి. కులపతి హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ వేడుకలకు హాజరవుతున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జేఎన్‌టీయూలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఆదికవి నన్నయ యూనివర్సిటీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి స్నాతకోత్సవ సంబరాలు జరుగనున్నాయి.

హెలిపాడ్, వేదికలను పరిశీలించిన ఎస్పీ

రాజమహేంద్రవరం సమీపంలోని గైట్ ఇంజినీరింగ్ కాలేజీలోని హెలిపాడ్ ఏరియాను, 'నన్నయ' వర్సిటీలో స్నాతకోత్సవం జరిగే ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లను ఎస్పీ పి.జగదీష్ మంగళవారం పరిశీలించారు. భద్రపరమైన అంశాలను జేసీ ఎన్.తేజభరత్, గవర్నర్ సెక్యూరిటీ అధికారులతో చర్చించారు.

ట్రైల్ రన్

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం జరిగే స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ హాజరవుతున్న నేపథ్యంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎస్పీ జగదీష్, జేసీ తేజభరత్, ఆర్డీఓ చైత్రవర్షిణి, తదితర ఉన్నతాధికారులు యూనివర్సిటీ ప్రాంగణాన్ని నిశితంగా పరిశీలించి, ట్రైల్ రన్ నిర్వహించారు. గవర్నర్ కోసం ఏర్పాటు చేసిన అతిథి గృహాన్ని, సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.

సుధామూర్తికి గౌరవ డాక్టరేట్

ప్రముఖ సంఘసేవకురాలు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, రచయిత, కంప్యూటర్ ఇంజినీర్, పద్మభూషణ్ సుధామూర్తికి ఈ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్‌ని ప్రదానం చేయనున్నారు.

జేఎన్‌టీయూకేలో ఏర్పాట్లు పూర్తి

జేఎన్‌టీయూ కాకినాడ పదో స్నాతకోత్సవం బుధవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, పీఆర్ఓ సీహెచ్ సాయిబాబు తెలిపారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ వేడుకల్లో 2022–23 ఏడాదిలో ఉత్తీర్ణులైన బీటెక్ విభాగంలో 34,199 మంది, బీఆర్క్ 13, బి ఫార్మశీ 1,477,ఎంటెక్ 1,689,ఎంబీఏ 1,093,ఎంసీఏ 343,ఎంఫార్మశీ 332, బీబీఏ 21, ఫార్మ్–డీ 182, బీఆర్క్ 13, ఒడీలు (ఒరిజనల్ డిగ్రీ) విద్యార్థులు గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా అందుకోనున్నారని చెప్పారు. వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన వారికి 28 బంగారు పతకాలు, 64 పీహెచ్‌డీలు అందజేస్తామన్నారు. టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ రాజన్నకు గౌరవ డాక్టరేట్ అందజేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ నేవీ అధికారి ఎస్.వెంకట శేషాచారి, విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

నేడు సత్యదేవుని హుండీల లెక్కింపు


అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని హుండీలను బుధవారం తెరిచి, భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నారు. గత నెల 26న సత్యదేవుని హుండీలను తెరిచి కానుకలు లెక్కించారు. మళ్లీ 35 రోజుల తర్వాత స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నారు. హుండీల ద్వారా సుమారు రూ.1.5 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. స్వామివారి నిత్య కల్యాణ మంటపంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి జరిగే హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది అందరూ పాల్గొనాలని ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు.

డామిట్ కథ అడ్డం తిరిగింది

- బాధితుడు అనుకున్న వ్యక్తే సూత్రధారి
- ఇన్సూరెన్స్ సొమ్ము కోసం... శవపేటికలోని మృతదేహం అపహరణ
- మృతదేహాన్ని పెట్రోలు పోసి కాల్చి అతని మృతదేహంగా చిత్రీకరించే ప్రయత్నం
- చివరకు కటకటాలపాలయిన సూత్రధారి, మరో ముగ్గురు



పాతబొమ్మూరు క్రైస్తవ శ్మశానవాటికలో మృతదేహం లేని శవపేటిక



నెల్లివిజయ రాజు(పాతచిత్రం)

రంగంపేట/రాజమహేంద్రవరం రూరల్: అప్పుల పాలైన ధాన్యం వ్యాపారి ఇన్సూరెన్స్ సొమ్ము కోసం తాను మృతిచెందినట్లు శవపేటికలో ఉన్న మృతదేహాన్ని తీసుకువచ్చి పెట్రోలు పోసి కాల్చి నమ్మించేందుకు చేసిన ప్రయత్నం పోలీసుల విచారణలో బెడిసికొట్టింది. చివరకు ధాన్యం వ్యాపారితో పాటు, అతనికి సహకరించిన ముగ్గురు కటకటాల పాలయ్యారు. రంగంపేట మండలం పాతవీరంపాలెం గ్రామశివారు కేతమల్లు వెంకటేశ్వరరావు(పూసయ్య) జీడిమామిడితోటలో ఈ నెల 26వ తేదీన కాలిన మృతదేహం ఉండడంతో వీఆర్వో ఫిర్యాదు మేరకు రంగంపేట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహం వెంకటేశ్వరరావుదిగా భావించి పోస్టుమార్టం కోసం అనపర్తి ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావు భార్య అతని మృతదేహంపై పడి తీవ్రంగా ఆవేదన చెందుతున్న విషయం తెలుసుకున్నాడు. దీంతో అతను వెంటనే భార్యకు ఫోన్ చేసి ఎవరో బాడీని తగులబెట్టి తనను కొట్టి తుప్పల్లో పడవేశారని చెప్పాడు. వెంకటేశ్వరరావు బతికి ఉండడంతో కాలిన మృతదేహం ఎవరిదో తెలుసుకునేందుకు రాజమహేంద్రవరం తూర్పు మండల డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో అనపర్తి సీఐ పి.శివగణేష్, రంగంపేట ఎస్సై పి.విజయకుమార్ దర్యాప్తు చేపట్టారు. దీంతో నిందితుడు అసలు విషయాన్ని బయట పెట్టాడు.

వీరంపాలెం గ్రామానికి చెందిన కేతమళ్ల వెంకటేశ్వరరావు(పోసియ్య)కు అప్పులు ఎక్కువగా ఉండడంతో తన పేరుపై ఉన్న రూ. కోటి ఇన్సూరెన్స్‌ను క్లయిమ్ చేసుకొనేందుకు ప్లాన్ వేశాడు. ఆ ప్లాన్‌ను అమలు చేసేందుకు హుకుంపేట గ్రామానికి చెందిన వందే శ్రీను, తలారి సుబ్బారావు, మోరంపూడికి చెందిన సిరాచిన్నాలతో వెంకటేశ్వరరావును వినియోగించాడు. ఒక శవాన్ని తీసుకొచ్చి తన పొలంలో కాల్చేయాలని నిర్ణయించాడు. ఆ ముగ్గురితో రూ.రెండు లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వారు ఈ నెల 25వ తేదీ రాత్రి పాతబొమ్మూరులోని క్రైస్తవ శ్మశాన వాటికలో ఒక శవాన్ని తవ్వి బయటకు తీశారు. సదరు మృతదేహాన్ని శ్రీను కారులో వేసుకొని రాత్రి ఒంటి గంట ప్రాంతంలో పాత వీరంపాలెం వెళ్లి వెంకటేశ్వరరావుకు తెలిపాడు. ఇద్దరూ కలిసి శవాన్ని తగులబెట్టి అక్కడ నుంచి పరారయ్యారు. ఈ నెల 26వ తేదీన వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆ కాలిపోయిన బాడీ వెంకటేశ్వరరావుది అని భావించి శవాన్ని అనపర్తి హాస్పిటల్‌కు తరలించారు, అనంతరం గ్రామంలో తన భార్య, పిల్లలు కుటుంబ సభ్యులు బాధపడుతున్నారని శ్రీను ద్వారా తెలిసి, ఎవరో బాడీని తగులబెట్టి తనని కొట్టి తుప్పల్లో పడేసారని డ్రామా మొదలెట్టాడు. చివరకు పోలీసులు వెంకటేశ్వరరావు, అతనికి సహకరించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించడంతో మొత్తం డ్రామా బయటపడింది.

ఆ మృతదేహం నెల్లి విజయరాజుది

పాతబొమ్మూరు క్రైస్తవ శ్మశానవాటికలో తస్కరించిన మృతదేహం బొమ్మూరు గ్రామానికి చెందిన ఓఎన్‌జీసీ ఉద్యోగి నెల్లి విజయరాజుదిగా పోలీసులు గుర్తించారు. నెల్లివిజయరాజు అనారోగ్యంతో ఈనెల 23వ తేదీన మృతిచెందారు. ఈ నెల 24న ఖననం చేశారు. 29న అతని జ్ఞాపకార్థకూడిక నిర్వహించారు. అయితే మంగళవారం రంగంపేట పోలీసులు నిందితులను తీసుకుని పాతబొమ్మూరు శ్మశానవాటిక వద్దకు వెళ్లే వరకు గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు నెల్లి విజయరాజు మృతదేహాన్ని తీసుకువెళ్లి పెట్రోలుతో దహనం చేశారన్న విషయం తెలియలేదు. పోలీసులు విజయరాజు ఖననం చేసిన చోట తవ్వించి చూడగా అందులో మృతదేహం కనిపించలేదు. అనపర్తి హాస్పిటల్‌లో ఉన్న మృతదేహం విజయరాజుదిగా ఆయన కుటుంబసభ్యులు గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పాతబొమ్మూరులోని శ్మశానవాటికకు తీసుకువచ్చి ఖననం చేశారు.